## పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి



టేక్మాల్, నవంబర్ 12: బీఆర్ఎస్ టేక్మాల్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్పకు సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సన్మానించి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పార్టీ జిల్లా యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్, మాజీ ఎంపీటీసీ సిద్దయ్య తదితరులు ఉన్నారు.

## సన్నవడ్లు కాంటా చేయాలి: ఆర్డీవో



శివ్వంపేటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో మహిపాల్‌రెడ్డి

శివ్వంపేట, నవంబర్ 12: ప్రభుత్వం సూచించిన ప్రకారం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన సన్న రకం ధాన్యాన్ని వెంటనే కాంటా చేయాలని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం శివ్వంపేటలోని పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా దొడ్డు రకంతో పాటు, సన్న రకం వడ్లు కొనాలని పీఏసీఎస్ సీఈవో మధుకు సూచించారు. ఏవైనా అవకతవకలు జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆర్డీవోతో తహసీల్దార్ కమలాద్రి, ఆర్ఐ కిషన్, కొనుగోలు సెంటర్ నిర్వాహకులు ఉన్నారు.

## బీడీ కార్మికుల సంక్షేమం గాలికి: ఏఐటీయూసీ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యవారి లక్ష్మణ్

నిజాంపేట, నవంబర్ 12: బీడీకార్మికుల సంక్షేమాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గాలికి వదిలేశాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అయ్యవారి లక్ష్మణ్ విమర్శించారు. నిజాంపేటలోని నూతన బస్టాప్ వద్ద ఏఐటీయూసీ 2 వ మహాసభల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి నాయకులు యూసూఫ్, యేసురత్నం, కేశవులు, నందం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికుల పట్ల వ్యవహరిస్తున్న తీరు బాగాలేదన్నారు. జీఎస్టీని తగ్గించి బీడీ కార్మికుల ఆర్థిక అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం బీడీ కార్మిక జిల్లా కమిటీని ఎన్నకున్నారు. బీడీ కార్మిక కమిటీ జిల్లా అధ్యక్షురాలిగా జీడి బాల్‌లక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా సంతోష, ప్రధాన కార్యదర్శిగా అయ్యవారి లక్ష్మణ్, సహాయక కార్యదర్శిగా అయ్యవారి విష్ణు, కోశాధికారిగా భాగ్యను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, కిష్టాపురం లక్ష్మణ్, ముక్రం, వెంకట రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

## అక్రెడిటేషన్ కమిటీలో అవకాశం కల్పించాలి



ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉర్దూ జర్నలిస్టు నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 12: రాష్ట్ర, జిల్లా అక్రెడిటేషన్ కమిటీల్లో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్‌కు అవకాశం కల్పించాలని ఆ యూనియన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ అమీర్ అలీఖాన్‌ను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి రియాజొద్దిన్ మాట్లాడుతూ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లగా అక్రెడిటేషన్ కమిటీల్లో చేర్చాలని కోర్టు తెలిపిందన్నారు. ఇందుకు సంబంధించి జీవో 239లో సవరణలు పురోగతిలో ఉన్నదని, న్యాయ ఆధారిత మార్గదర్శకాలను రూపొందిస్తున్నదని ఎమ్మెల్సీ తెలిపారన్నారు.

## రెవెన్యూ అధికారులపై దాడులు సరికాదు



మాసాయిపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న తహసీల్దార్, సిబ్బంది

తూప్రాన్, నవంబర్ 12: వికారాబాద్ జిల్లా లగచర్ల ఫార్మాసిటి కోసం ప్రజాభిప్రాయ సేకరణ కోసం రెవెన్యూ అధికారులు వెళ్లగా అధికారులపై దాడి ఘటనను నిరసిస్తూ తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర, ఉద్యోగులు ఉన్నారు.

**వెల్దుర్తిలో..**

వెల్దుర్తి, నవంబర్ 12: వికారాబాద్ జిల్లా లగచర్లలో ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లిన కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర అధికారులపై దాడులు చేయడం సరికాదని మాసాయిపేట తహసీల్దార్ జ్ఞానజ్యోతి అన్నారు. దాడులను వ్యతిరేకిస్తూ తహసీల్ కార్యాలయం ఎదుట ఆర్ఐ ధన్‌సింగ్, ఇతర సిబ్బందితో కలిసి నిరసన వ్యక్తం చేశారు.

**నర్సాపూర్‌లో..**

నర్సాపూర్, నవంబర్12: వికారాబాద్ జిల్లాలో కలెక్టర్, రెవెన్యూ సిబ్బందిపై జరిగిన దాడిని ఖండిస్తూ నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయం వద్ద ఆర్డీవో మహిపాల్ సిబ్బందితో కలిసి నిరసన వ్యక్తం చేశారు.

## మూఢనమ్మకాలు, మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం



విన్యాసాలు చేస్తున్న సైంటిఫిక్ స్టూడెంట్ నరేశ్

వెల్దుర్తి, నవంబర్ 12: మూఢనమ్మకాలు, మత్తు పదార్థాలతో విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని వెల్దుర్తి ఎస్సై రాజు, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు నరేశ్ తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వెల్దుర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బా పాఠశాలల్లో డ్రగ్స్, వ్యక్తిత్వ వికాసం, సైన్స్ మూఢ నమ్మకాల నిర్మూలన అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

## మట్టిని అక్రమంగా తరలిస్తున్న లారీలు పట్టివేత



పట్టుబడిన రెండు మట్టి లారీలు

రామాయంపేట, నవంబర్ 12: రామాయంపేట శివారులోని 1421 సర్వేలో టిప్పర్లలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు తహసీల్దార్ రజినీకుమారి పేర్కొన్నారు. మంగళవారం జాతీయ రహదారి ప్రభుత్వ సర్వే నెంబర్‌లో అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందని, దీంతో సిబ్బందితో వెళ్లి రెండు లారీలను పట్టుకున్నామని తెలిపారు. రామాయంపేట ఎస్సై బాలరాజుకు సమాచారం చేరవేసి రెండు లారీలను పోలీసులకు అప్పగించినట్లు తహసీల్దార్ తెలిపారు.

## విద్యార్థిని ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి



రామాయంపేటలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

రామాయంపేట, నవంబర్ 12: బాసర ట్రిబుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్యకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రామాయంపేటలోని మెదక్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బండారి ప్రశాంత్, నగర కార్యదర్శి హరి, అర్జున్, నవీన్, నరేందర దీక్షిత తదితరులు ఉన్నారు.

# ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరం

- సాయిబాబా ఆలయ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే హాజరు
- కార్తిక మాసం ప్రత్యేక పూజలు



మాసాయిపేటలో పాండురంగస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

వెల్దుర్తి, నవంబర్ 12: ప్రతి ఒక్కరికీ ఆధ్యాత్మిక చింతన అవసరమని ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. మాసాయిపేట సాయి బాబా ఆలయ 9వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఎమ్మెల్యేను సన్మానించారు. వేద పండితులు ఆశీర్వచనం చేశారు. గ్రామంలోని పాండురంగస్వామి దేవాలయంలో కార్తిక మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. రెండు రోజుల క్రితం రాజిరెడ్డి నానమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డిని మాసాయిపేటలోని వారి నివాసంలో కలిసి ఎమ్మెల్యే పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు నాగరాజు, మోహన్‌రెడ్డి, శ్రీనునాయక్, పవన్, నర్సింలు, రాము, సాయిలు తదితరులు ఉన్నారు.

**పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా**



నర్సాపూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, నవంబర్ 12: పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసానిస్తున్నదని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం నర్సాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. తుకారాంతండా నాల్గో వార్డుకు చెందిన కాట్రోత్ మోహన్‌కు రూ.60 వేలు, చిప్పల్‌తుర్తి గ్రామానికి చెందిన నవాజ్‌కు రూ.60 వేలు, నర్సాపూర్ మున్సిపాలిటీలోని జగన్నాథరావు కాలనీకి చెందిన వ్యక్తికి రూ.42 వేల విలువ చేసే చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమోద్దీన్, మాజీ వైస్ ఎంపీపీ వెంకట నర్సింగరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, సత్యంగౌడ్, షేక్‌హుస్సేన్, శివకుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుల పుట్టినరోజు



కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి వివాహ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గెల్లురాజం

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 12: జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీ హవేళీఘనపూర్, చిన్న శంకరంపేట మండలాల అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, రాజు పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి తినిపించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, పార్టీ మెదక్ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మాజీ మున్సిపల్ చైర్మన్ జగపతి, కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, ఆర్‌కె శ్రీనివాస్, కిశోర్, నాయకులు లింగారెడ్డి, కృష్ణాగౌడ్, జుబేర్, సాయిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు తదితర నాయకులు పాల్గొన్నారు.

**మాజీ ఎమ్మెల్యే ఆర్థిక సాయం**

మెదక్‌రూరల్, నవంబర్ 12: మండలంలోని మగ్దుంపూర్ గ్రామానికి చెందిన కంచం స్వామి సోమవారం గుండెపోటుతో మృతిచెందారు. విషయాన్ని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంజాగౌడ్, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆమె రూ.5వేల ఆర్థిక సాయాన్ని నాయకుల ద్వారా బాధిత కుటుంబానికి మంగళవారం అందజేశారు. సాయం అందజేసిన వారిలో పార్టీ గ్రామ అధ్యక్షుడు గిరిధర్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ రజినికాంత్, నాయకులు హన్మంత్‌రెడ్డి, సుదర్శన్, మధు, యాదగిరి, శామయ్య, నరేశ్ తదితరులు ఉన్నారు.

**మాజీ ఎమ్మెల్యేకు వివాహ ఆహ్వానం**

నిజాంపేట, నవంబర్ 12: బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని నందిగామ మాజీ ఉప సర్పంచ్ గెల్లు రాజం మంగళవారం హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో కలిశారు. అనంతరం మాజీ ఉప సర్పంచ్ రాజం తన కూతురు వివాహానికి రావాలని వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు. అక్కడ రజక సంఘం జిల్లా అధ్యక్షుడు సంగుస్వామి ఉన్నారు.

## అమాయకులే టార్గెట్‌గా హత్యలు

- వరుస హత్యల కేసులో నిందితులు అరెస్ట్
- నిందితునిపై రెండు హత్యలు, హత్యాయత్నం, దొంగతనం కేసులు నమోదు
- ఐదు మొబైల్ ఫోన్లు, బంగారు ఉంగరం, గొలుసు, ల్యాప్‌టాప్, సుత్తిలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



నిందితులను చూపుతున్న జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, నవంబర్12: అమాయకులే టార్గెట్‌గా వరుస హత్యలు చేస్తున్న నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు తెలిపారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలో గత నెల 20న, ఈ నెల 3న జరిగిన గుర్తుతెలియని వ్యక్తుల హత్య, దహనం కేసుల్లో నిందితులను అరెస్ట్ చేశారు. చిన్నశంకరంపేట మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన ఒట్టెం మల్లేశం (32), 2013లో శంకరంపేట ఆర్ పోలీస్‌స్టేషన్‌లో హత్య కేసులో 10 సంవత్సరాలు శిక్షపడింది. 2017లో జైలు నుంచి విడుదలయ్యాడు. ఆ తర్వాత 2017లో సెంట్రల్ జైలులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఒకరిని వేధించగా, వారు అతడిపై కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ వేధింపులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకొని 2019లో కీసర పోలీస్‌స్టేషన్ పరిధి నేతాజీ నగర్‌లో వారి ఇంట్లోకి ప్రవేశించి ఇంటి వరండాలో ఉన్న వాషింగ్ మిషన్, ఇంటి మెయిన్ డోర్ కొన్ని వస్తువులను తగలబెట్టాడు. ఈ కేసును విచారించి మళ్లీ జైలుకు పంపించారు. ఆ కేసులో 2022లో జైలు నుంచి విడుదలై, కాచిగూడ నుంచి నిజామాబాద్ వెళ్లే రైల్‌లో దొంగతనాలు చేస్తూ రైల్వే ప్లాట్‌ఫార్‌పై నివసిస్తుండేవాడు. ఒంటరిగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని నేరాలు చేస్తుంటాడు. గత నెలలో ఒట్టెం మల్లేశం అలియాస్ గొల్ల మల్లేశం నిజామాబాద్‌లోని లేబర్ అడ్డ వద్ద కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామానికి చెందిన నవీన్ (24)ను పరిచయం చేసుకుని, రైల్లో మీర్జాపల్లి రైల్వేస్టేషన్‌కు తీసుకొచ్చి, అక్కడి నుంచి చిన్నశంకరంపేటలోని వైన్స్‌లో మద్యం తాగించి ప్రభుత్వ దవాఖాన వెనుక వైపు గల కారిడారు వద్దకు తీసుకొచ్చి బండరాయితో కొట్టి చంపి కాల్చేశాడు. ఆ తర్వాత తేది ఈ నెల 3న ఇందలవాయి రైల్వేస్టేషన్ స్టేషన్‌లో నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం కుర్నాపల్లికి చెందిన కొమ్రే స్వామి (39) తీసుకొచ్చి చిన్నశంకరంపేటలో మద్యం తాగించి, పద్మనాభ స్వామి గుట్ట వద్ద గల బస్ స్టేషన్ సమీపంలో బండరాయితో కొట్టి చంపి కాల్చేశాడు. రైలులో ప్రయాణిస్తూ ప్యాసింజర్‌ను సుత్తితో కొట్టి అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలు దొంగలించాడు. ఆ బంగారు ఆభరణాలు, మొబైల్ ఫోన్‌ను అతని అన్న ఒట్టెం రమేశ్‌కు ఇచ్చాడు. నిందితులు ఇద్దరిని పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వారి వద్దనుంచి ఐదు మొబైల్ ఫోన్లు, ఒక సుత్తి, బంగారు గొలుసు, బంగారు ఉంగరం, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకునేందుకు మూడు బృందాలు పని చేసినట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా పనిచేసిన పోలీసులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ మహేందర్, తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన డిగ్రీ విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 12: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. ఉస్మానియా యూనివర్శిటీలో ఈనెల 9, 10వ తేదీల్లో జరిగిన పోటీల్లో 126 డిగ్రీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 400 మీటర్ల పరుగు పందెంలో మెదక్ డిగ్రీ విద్యార్థి శేఖర్ బంగారు పతకం సాధించాడు. 4x400 రిలే పరుగు పందెంలో బీఏ విద్యార్థులు ముఖేశ్, ప్రకాశ్, నితిన్, అశోక్ రజత పతకాన్ని సాధించారు. వంద మీటర్ల పరుగు పందెంలో బీఎస్సీ విద్యార్థి మహమ్మద్ ఆమానుద్దీన్ రజతం, 400 మీటర్ల పరుగు పందెంలో బీఏ విద్యార్థి భరత్ కుమార్ కాంస్య పతకం సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ హుస్సేన్, అధ్యాపకులు పీడీ వెంకటేశ్వర్లు మంగళవారం సత్కరించారు.

**కొనసాగుతున్న జోనల్ స్పోర్ట్స్ మీట్**

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 12: మెదక్‌లో కొనసాగుతున్న జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో మంగళవారం రెండో రోజు ఖోఖో, కబడ్డీ, తదితర అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఈనెల 14 వరకు కొనసాగనున్నాయి. ఈ పోటీల్లో వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### రైస్‌మిల్లు పొట్టులో ఊపిరాడక

## కూలీ దుర్మరణం

శివ్వంపేట, నవంబర్ 12: ఇటుక బట్టీలు, పరిశ్రమలకు ఉపయోగించే వడ్ల పొట్టును నింపడానికి వెళ్లిన కూలీ పొట్టులో పడి దుర్మరణం చెందిన ఘటన శివ్వంపేట మండలం గుండ్లపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపల్లి గ్రామానికి చెందిన చిట్టబోయిన శంకర్ వడ్ల పొట్టు వ్యాపారం చేస్తున్నాడు. ఇటుక బట్టీలు, కంపెనీలకు రైస్‌మిల్ నుంచి పొట్టును సరఫరా చేస్తున్నాడు. సోమవారం రాత్రి పక్క గ్రామం దంతాన్‌పల్లి రైస్‌మిల్‌లో పొట్టు నింపేందుకు జేసీబీ డ్రైవర్ రమేశ్‌తో కలిసి లింగంపల్లి యాదగిరి (42)ను కూలిగా తీసుకెళ్లాడు. పొట్టు నింపే క్రమంలో డీసీఎంకు ఇరువైపులా ఉండే బోరెంలో యాదగిరి పొట్టును తొక్కుతుండగా జేసీబీ డ్రైవర్ గమనించకుండా అతనిపైనే పొట్టును వేశాడు. దీంతో ఊపిరాడక యాదగిరి అందులోనే మృతిచెందాడు. జేసీబీ, డీసీఎం డ్రైవర్లు ఇంటికి వచ్చారాని, యాదగిరి రాలేదని, అతడి భార్య భర్తకు ఫోన్ చేసింది. రింగ్ అవుతున్నా తీయకపోవడంతో, గ్రామస్తులతో కలిసి వచ్చి రైస్ మిల్ ఉన్న డీసీఎంలో చూడగా మృతుని ఫోన్ రింగ్ అవుతున్నది. దీంతో పొట్టును ఖాళీ చేయగా యాదగిరి మృతదేహం బయటపడింది. మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి: డీపీవో



చిన్నశంకరంపేట: కొర్విపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న డీపీవో యాదయ్య



రామాయంపేటలో సర్వేను పరిశీలిస్తున్న మెదక్ ఆర్డీవో రమాదేవి



శివ్వంపేటలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో మహిపాల్‌రెడ్డి

చిన్నశంకరంపేట, నవంబర్ 12: ఇంటింటి సమగ్ర సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని డీపీవో యాదయ్య సూచించారు. మంగళవారం ఆయన కొర్విపల్లి, గవ్వలపల్లి గ్రామాల్లో ఇంటింటి సర్వేను పరిశీలించారు.

**సమగ్ర సర్వేను పరిశీలించిన ఆర్డీవో**

శివ్వంపేట, నవంబర్ 12: మండలంలోని పలు గ్రామాల్లో సమగ్ర ఇంటింటి సర్వేను నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి ప్రతాప్‌సింగ్ పరిశీలించారు. వారితో తహసీల్దార్ కమలాద్రి, ఎంపీడీవో నాగేశ్వర్, ఎంపీవో తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

**నిజాంపేటలో..**

నిజాంపేట, నవంబర్ 12: చల్మెడ గ్రామంలోని సోమయ్య చెరువులో మత్స్యశాఖ సిబ్బంది డేవిడ్ రాబర్ట్, గ్రామ గంగపుత్ర సంఘం సభ్యులు చేప పిల్లలను మంగళవారం వదిలారు. మండల ఏవో సోమలింగారెడ్డి, ఏఈవో రాజు, సిబ్బంది మల్లేశం, జయరాజ్, గంగపుత్ర సంఘం సభ్యులు ఉన్నారు.

**ప్రతి ఇంటిలో సర్వే పక్కాగా నిర్వహించాలి**

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 12: పట్టణంలో ప్రతి ఇంటిలో సమగ్ర సర్వేను పక్కాగా నిర్వహించాలని ఆర్డీవో రమాదేవి ఆదేశించారు. మున్సిపల్‌లోని వార్డు నంబర్ 18 ఆర్టీసీ కాలనీలో సమగ్ర సర్వేను పరిశీలించారు. ఆమె వెంట మెదక్ తహసీల్దార్ లక్ష్మన్ బాబు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

**గడువు లోపు సర్వే పూర్తి చేయాలి**

రామాయంపేట, నవంబర్ 12: గడువు లోపు సర్వేలు పూర్తి చేయని ఎన్యుమరేటర్లపై చర్యలు తీసుకుంటామని మెదక్ ఆర్డీవో రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం రామాయంపేటలో జరుగుతున్న సామాజిక కులగణన సర్వేలో ఆకస్మిక తనిఖీ చేపట్టిన ఆర్డీవో సర్వేలు అనుకున్న స్థాయిలో జరగడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎన్యుమరేటర్లు గడువు లోపు సర్వేలను పూర్తి చేయాలన్నారు. ఆర్డీవోతో రామాయంపేట తహసీల్దార్ రజినీ కుమారి, కమిషనర్ దేవేందర్ ఉన్నారు.

## ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ ఫలితాలు విడుదల

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 12: ఓపెన్ ఎస్సెస్సీ ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్ష ఫలితాలు విడుదల అయ్యాయని, www.teleanganaopenschool.org వెబ్‌సైట్‌లో ఫలితాలను డౌన్‌లోడ్ చేసుకోవాలని డీఈవో రాధాకిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 61 మంది అభ్యర్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 33 మంది ఉత్తీర్ణులయ్యారని, ఇంటర్మీడియట్‌లో 179 మంది పరీక్షలు రాయగా 115 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. మార్కుల రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం సంబంధింత వెబ్‌సైట్‌లో ఈనెల 14 నుంచి 20వ తేదీలోగా నిర్ణీత రుసుం చెల్లించాలని పేర్కొన్నారు.

## ఈనెల 27న డాక్ అదాలత్

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 12: తపాలా సేవలకు సంబంధించి ప్రజల ఫిర్యాదులు పరిష్కారించడానికి ఈనెల 27న పోస్టాఫీస్‌లోని 1వ అంతస్తులో డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మెదక్ తపాలా శాఖ అధికారి శ్రీహరి మంగళవారం ప్రకటనలో తెలిపారు. మెదక్ డివిజన్‌లోని తపాలా సేవలకు సంబంధించి ఏవైనా సందేహాలు, ఫిర్యాదులుంటే ఈనెల 22వ తేదీలోగా ఫిర్యాదుల ఉత్తరాలపై డాక్ అదాలత్ అని రాసి పంపాలన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలి

మెదక్‌రూరల్, నవంబర్ 12: రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి లక్ష్మణ్ సూచించారు. వెంకటపూర్ తండాలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో వీఏ భానుచందర్, ఓఎస్ యాదయ్య, రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఫీజు చెల్లించిన దాత

చిన్నశంకరంపేట, నవంబర్ 12: మండలంలోని ధర్పల్లి జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థుల వార్షిక ఫీజును ఓ దాత మంగళవారం చెల్లించారు. పాఠశాలలోని 36 మందికి (ఒక్కొక్క విద్యార్థికి రూ.125 చొప్పున) మొత్తం రూ.4500 చెక్కును ఆర్ట్ టు హెల్ప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వెంకటలక్ష్మి సౌజన్యంతో హెచ్ఎం రమేశ్‌చౌదరికి ట్రస్ట్ అధ్యక్షుడు రవినాయక్ అందజేశారు.

## ట్రాన్స్‌కో ఏఈగా దినాకర్

చిన్నశంకరంపేట, నవంబర్ 12: చిన్నశంకరంపేట మండల ట్రాన్స్‌కో ఏఈగా దినాకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ ఏఈగా పని చేసిన సతీశ్ ఉద్యోగోన్నతిపై వెళ్లారు.

## మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా రాజేందర్



నియామక పత్రాన్ని అందుకుంటున్న దాడిగే రాజేందర్

నర్సాపూర్, నవంబర్ 12: మాల మహానాడు జిల్లా అధ్యక్షుడిగా నర్సాపూర్ మండలం అహ్మద్‌నగర్ గ్రామానికి చెందిన దాడిగే రాజేందర్ ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మాల మహానాడు రాష్ట్రస్థాయి సమావేశంలో ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, రాష్ట్ర, జిల్లా అధ్యక్షుల ఆధ్వర్యంలో నియామక పత్రాన్ని అందజేశారు. తన ఎంపికకు కృషి చేసిన జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, రాష్ట్ర, జిల్లా నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## హుండీ లెక్కింపు

శివ్వంపేట, నవంబర్ 12: మండలంలోని సికింద్లాపూర్‌లో గల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం హుండీ లెక్కించారు. ఏడు నెలల హుండీ ఆదాయం రూ. 1,37,076 వచ్చిందని దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఈవో శశిధర్ గుప్తా తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన పూజారి ధనుంజయ శర్మ, జూనియర్ సహాయకుడు నరసింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల అభివృద్ధికి కృషి



రామాయంపేట చెరువులో చేపపిల్లలను వదులుతున్న మత్స్యకారులు

రామాయంపేట, నవంబర్ 12: మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు, కౌన్సిలర్ దేమె యాదగిరి, మత్స్యకార సంఘం మండల అధ్యక్షుడు సర్వయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మల్లె చెరువులో 30,440 చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సుందర్‌సింగ్, రాజు, చిలుక స్వామి, అల్లాడి వెంకటేశ్ ఉన్నారు.